

ఖాతాకు లింకు లేకపోవడంతో 1,360 మంది దూరం

జిల్లా వ్యాప్తంగా 1,360 మంది తల్లుల ఖాతాలు ఎన్‌పీసీఐతో అనుసంధానం కాలేదు. దీనివల్ల వీరు ప్రస్తుతానికి లబ్ధికి దూరమయ్యారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక ప్రకటన జారీచేశారు. షెడ్యూల్ కులానికి చెందిన 9,10 చదువుతున్న విద్యార్థులకు అందే నిధులు కూడా తల్లుల ఖాతాల్లోనే జమ అవుతుందని స్పష్టం చేశారు. అలాగే ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నిధులు వారి వ్యక్తిగత ఖాతాల్లోకి జమకానున్నాయని వెల్లడించారు. తల్లికి వందనం పథకం నుంచి లబ్ధి కలగాలంటే 1,360 మంది తల్లులు వారి బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో లింకు చేయించుకోవాలని స్పష్టం చేశారు.

తల్లికి వందనం



అమ్మ ఆనందం

- ఖాతాల్లో 'తల్లికి వందనం' నిధులు జమ
- నలుగురు పిల్లలున్న వారికి రూ.52వేలు
- ఎలాంటి ఆర్భాటం లేకుండా పథకం అమలు
- విద్యార్థుల తల్లుల్లో హర్షాతిరేకాలు
- జమ అయినట్లు బ్యాంకు నుంచి మెసేజ్‌లు

'ఎంతమంది పిల్లలున్నా ఒక్కరికే.. అమ్మఒడి'.. జగన్ ప్రభుత్వంలో తీరిది. 'ఎంతమంది పిల్లలు ఉన్నా.. అందరికీ తల్లికి వందనం'.. కూటమి సర్కారు భరోసా ఇది. ఎన్నికలకు ముందు ఇచ్చిన మరో హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారు. ఇద్దరు కాదు.. ముగ్గురు, నలుగురు పిల్లలు ఉన్నా డబ్బులు ఇచ్చారు. పాఠశాల నిర్వహణ ఖర్చుపోను రూ.13వేల చొప్పున శుక్రవారం జమ చేశారు. దీంతో తల్లుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. 'మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి' అంటూ మొబైల్‌కు వచ్చిన మెసేజ్‌లను చూపిస్తున్నారు.



తల్లికి వందనం పథకం మంజూరైన తమ నలుగురు పిల్లలతో రెడ్డికపేటకు చెందిన కోరెడ్డి వేణుగోపాలరెడ్డి, విజయలక్ష్మి

శ్రీకాకుళం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి)

తల్లికి వందనం పథకం ఎలాంటి ఆర్భాటం.. ప్రచారం లేకుండానే ప్రభుత్వం అమలు చేసింది. చెప్పిందే తడవుగా తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసింది. సంబంధిత బ్యాంకుల నుంచి లబ్ధిదారుల సెల్ ఫోన్‌లకు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో శుక్రవారం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో సందడి జోరందుకుంది. గతంలో అమ్మఒడి పథకం అమలు చేసినప్పుడు పెద్దసభ పెట్టి.. లబ్ధిదారులను అక్కడికి తరలించి.. అప్పటి సీఎం బటన్ నొక్కగానే నెలాఖరు వరకు ఖాతాల్లో నగదు జమ అవుతుండేది. అంతకుముందు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పెద్ద ప్రహసనంగా ఉండేది. వలంటీర్ల చుట్టూ తిరగాల్సివచ్చేంది. ఈ తంతేమీ లేకుండా జీవో జారీ అయిన రోజు వ్యవధిలోనే నగదు జమఅయిపోయింది. దీంతో 1,52,563 కుటుంబాలు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బి అవుతున్నాయి.

ముగ్గురు, నలుగురు పిల్లల తల్లుల ఖాతాల్లో నగదు..

శ్రీకాకుళం, నరసన్నపేట, పాతపట్నం, ఇచ్ఛాపురం, టెక్కలి, ఎచ్చెర్ల, పలాస, ఆమదాలవలస నియోజకవర్గాల్లో (మిగతా 6వ పేజీలో..)

ఒకే కుటుంబంలో నలుగురికి..

నరసన్నపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలం గొట్టిపల్లి పంచాయతీ రెడ్డికపేటకు చెందిన కోరెడ్డి వేణుగోపాలరెడ్డి, విజయలక్ష్మి దంపతులకు నలుగురు ఆడపిల్లలు. మొదటి సంతానం కోరెడ్డి హేమరాణి ఇంటర్ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. రెండో కుమార్తె కోరెడ్డి మోహినీరాణి పదోతరగతి చదువుతోంది. మూడో కుమార్తె మణి ఏడోతరగతి, నాలుగో కుమార్తె వందన ఐదోతరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం కింద తన నలుగురు ఆడపిల్లలకు రూ.13వేల చొప్పున రూ.52వేలు బ్యాంకు ఖాతాలో పడటంతో ఎంతో ఆనందంగా ఉందని తల్లి విజయలక్ష్మి, తండ్రి వేణుగోపాలరెడ్డి తెలిపారు. గతంలో నలుగురు పిల్లలున్నా.. ఒక్కరికే రూ.13వేలు వచ్చేదని, నలుగుర్ని చదివించేందుకు చాలా ఇబ్బందులు పడ్డామని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నలుగురికి రూ.52 వేలు జమ..

మెళియాపుట్టి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో కరజాడ గ్రామానికి చెందిన కుమ్మల దమయంతికి నలుగురు ఆడ పిల్లలు. తల్లికి వందనం నిధులు రూ.52 వేలు బ్యాంకు ఖాతాకు జమ ఆమె ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున వచ్చాయని దమయంతి తెలిపారు.



తల్లికి వందనంలో ఒకే ఇంటిలో నలుగురికి..

వేటకు వేళాయే!

- నేటి అర్ధరాత్రితో ముగియనున్న నిషేధం
- పడవలు, సామగ్రితో మత్స్యకారులు సిద్ధం
- రెట్టింపు భృతితో కొండంత అండ
- ప్రభుత్వానికి గంగపుత్రుల కృతజ్ఞతలు



వేటకు సిద్ధమైన మత్స్యకారులు

రణస్థలం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దాదాపు రెండు నెలల విరామం అనంతరం శనివారం అర్ధరాత్రి నుంచి చేపల వేట ప్రారంభం కానుంది. ఏటా వేసవిలో రెండు నెలల పాటు సముద్రంలో వేట నిషేధం విధిస్తున్న సంగతి తెలిసిందే. చేపల ఉత్పత్తి చేసే సమయంగా భావించి ఏటా ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకూ వేట నిషేధిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది అది పక్కాగా అమలైంది. శనివారం అర్ధరాత్రి నుంచి వేట ప్రారంభం కానుండడంతో మత్స్యకారులు సన్నాహాలు పూర్తిచేశారు. ఇప్పటికే పడవలు, వలలు, వేట సామగ్రిని తీరానికి చేర్చారు. రెట్టింపు ఉత్సాహంతో వేటకు సిద్ధమవుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వం వేట నిషేధ భృతిని రెట్టింపు చేసింది. ఈ రెండు నెలల పాటు ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.20 వేలు అందించింది. ఏప్రిల్ 26న సీఎం చంద్రబాబు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో మత్స్యకారులకు అందించారు. అప్పటివరకూ రూ.10 వేలు మాత్రమే అందుతుండగా.. కూటమి ప్రభుత్వం రెట్టింపు చేసింది. జిల్లాలో 16 వేల మందికి లబ్ధి చేకూరింది.

ఇదీ పరిస్థితి..

సుదీర్ఘ తీర ప్రాంతం జిల్లా సొంతం. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో 193 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ 104 మత్స్యకార గ్రామాలున్నాయి. లక్షకుపైగా జనాభా ఉన్నారు. మొత్తం 16 వేల మందికిపైగా మత్స్యకారులు వేటకు వెళ్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయితే జిల్లాలో ఫిషింగ్ హార్బర్లు కానీ, జెట్టీలు కానీ అందుబాటులో లేక మత్స్యకారులు సంప్రదాయ వేటకే పరిమితమయ్యారు. ఇప్పటికీ నాటు పడవలపై ప్రమాదకరస్థితిలో కొనసాగిస్తున్నారు. స్థానికంగా వేట గిట్టుబాటుగాక జిల్లా నుంచి వేలాది మంది చెన్నై, గుజరాత్, ముంబై, కోల్‌కటా, పారాదీప్ వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కాంట్రాక్టర్ల వద్ద (మిగతా 6వ పేజీలో..)

అన్నంతపని చేశారు

- పాఠశాలకు వెళ్లని విద్యార్థులు
- మద్యం దుకాణం తొలగించాల్సిందే
- అంతవరకు పంపమంటున్న తల్లిదండ్రులు
- ఈదుపురం వాసుల వినూత్న నిరసన

ఇచ్ఛాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పక్కనే ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని, లేకుంటే తమ పిల్లలను బడికి పంపించమని హెచ్చరించిన ఆ గ్రామస్థులు అన్నంతపని చేశారు. దీంతో శుక్రవారం విద్యార్థులెవరూ రాకపోవడంతో ఆ పాఠశాల బోసిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. ఈదుపురం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని ఆ గ్రామస్థులు కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఆ మద్యం దుకాణం వద్ద నిరసన తెలిపారు. అయినా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో శుక్రవారం తమ పిల్లలను పాఠశాలకు పంపించకుండా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ నర్తు ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ.. పాఠశాల పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల పిల్లలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరారు. లేకుంటే పిల్లలను గ్రామస్థులు ఎవరూ బడికి పంచేదిలేదన్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్ఎం తమ్మయ్యను ఫోన్‌లో సంప్రదించగా.. శుక్రవారం ఉదయం కొంత మంది విద్యార్థులు స్కూల్‌కి వచ్చారు. ఆ తర్వాత రెండు గంటల వ్యవధిలో తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను ఇంటికి తీసుకుని వెళ్లిపోయారు. మద్యం దుకాణం ఎత్తేంతవరకు తమ పిల్లలను బడికి పంపించమని చెప్పారన్నారు. అయితే ఈ సమస్య వల్ల కొత్తగా పాఠశాలలో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చేపడం లేదన్నారు. పిల్లలు వెళ్లిపోవడంతో పాఠశాల బోసిపోయిందని, అలాగే పిల్లల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనం వృథాగా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



పిల్లల సందడి లేని ఈదుపురం పాఠశాల ప్రాంగణం



ఖాళీగా ఉన్న తరగతి గది

ఒకరి రక్తం.. నలుగురికి ప్రాణాధారం

- అవగాహన లేక ముందుకురాని వైనం
- ఆరోగ్యవంతులు ఎన్నిసార్లయినా చేయవచ్చు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ప్రత్యేక కథనం 6లో

శ్రీకాకుళం నగరానికి చెందిన కొఠారి కల్యాణ్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నారు. 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 52 సార్లు రక్తదానం చేశారు. 'ప్రతీ ఏడాది మేడే, ఆగస్టు 15, నా పుట్టిన రోజున రక్తదానం చేస్తుంటా. రక్తదానం చేయడం వల్ల కొత్తరక్తం తయారై ఎంతో ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉంటాం. ఇతరుల ప్రాణాలు కాపాడినట్లు అవుతుంది. రక్తదానంపై ఎలాంటి అపోహలు వద్దు. యువత రక్తదానానికి ముందుకు రావాలి' అని కల్యాణ్ పిలునిస్తున్నారు. రక్తదానం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నా చాలామంది ముందుకు రావడం లేదు. దీనిపై అవగాహన కొరవడడం వల్లే ఓ విధమైన భయానికి లోనవుతున్నారు. అయితే కొంతమంది యువత పదులసార్లు రక్తదానం చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



డీఎస్సీకి 733 మంది హాజరు

ఎచ్చెర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ కొనసాగుతుంది. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో శుక్రవారం రెండు షిఫ్ట్‌ల్లో కలిపి 761 మంది హాజరుకావల్సి ఉండగా 733 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు.

19న జడ్పీ స్థాయీసంఘ సమావేశాలు

- సీఈవో శ్రీధర్ రాజా

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19వ తేదీన జడ్పీ స్థాయీసంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి సంబంధిత అధికారులు, సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

పిడుగు పాటుకు నాలుగు ఆవులు మృతి

లావేరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బుడుమూరులో శుక్రవారం మధ్యాహ్నం పిడుగుపాటుకు నాలుగు ఆవులు మృతి చెందాయి. పొలాల్లో ఆవులు మేస్తుండగా పిడుగు పడింది. దీంతో పిట్ట అప్పయ్యకు చెందినవి 2, పండి ధనుంజయరావు ఆవు ఒకటి, ఆరంగి రమణకు చెందిన ఒక ఆవు మృతి చెందాయి. స్థానిక పశువైద్యాధికారి హేమంత్ కుమార్ ఆవు కళేబరాలకు పోస్టుమార్టం చేశారు. తమకు జీవనాధారం కల్పించే పాడి పశువులు చనిపోవడంతో బాధిత రైతులు లబోదిబో మంటున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

సీఎస్‌కు ఎమ్మెల్యే శిరీష ఫిర్యాదు

పలాస, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పలాస మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ఫేక్ విజిలెన్స్ ఫిర్యాదులతో అధికారులను, కాంట్రాక్టర్లను ఇబ్బందులు పెడుతున్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సీఎస్ విజయానంద్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఆయన్ను ఎమ్మెల్యే కలిశారు. '2014-19 సంవత్సరాల మధ్య కాలంలో ఫేస్‌బుక్, వాట్సాప్ అకౌంట్లలో ఫేక్‌న్యూస్‌తో హల్‌చల్ చేసిన వ్యక్తి 2019-24 మధ్య హైదరాబాద్ పారిపోయాడు. మరలా ఎన్నికల ముందు పలాసకు వచ్చి బ్లాక్‌మెయిల్ మొదలుపెట్టాడు. సదరు వ్యక్తిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి' అని ఆమె ఫిర్యాదు చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి అడ్డుతగిలితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు.



విజయానంద్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

జీడి పరిశ్రమల బంద్ తగదు

- తక్షణమే వాటిని తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలి
- జీడి-రైస్ మిల్ కార్మిక సంఘం

6లో



మాట్లాడుతున్న కార్మిక సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి

ఆ ఉపాధ్యాయులు ఆదర్శం

- పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన వైనం

6లో

మండల వ్యవసాయశాఖ అధికారుల బదిలీ

- జోన్-1 పరిధిలోని 103 మందికి స్థానచలనం

నరసన్నపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జోన్-1 పరిధిలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేస్తున్న 103 మంది ఏవోలను బదిలీ చేస్తూ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 40 మందిని జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు.. ఇతర ప్రాంతాలు నుంచి జిల్లాకు వచ్చారు. శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు.

- ఎం. శ్రీనివాసబాబు మంచంగిపుట్టు నుంచి పొందూరు ఏవోగా, వై.శారద పాడేరు నుంచి ఏడీఏ కార్యాలయం-పలాసకు, వై.విశ్వేశ్వరరావు గుంటూరు నుంచి ఏడీఏ కార్యాలయం - సోంపేట, పి. విజయ్‌కుమార్ మన్యం జిల్లా నుంచి ఇచ్ఛాపురం ఏవో, కె. సింహాచలం భామిని నుంచి ఎల్ఎన్‌పేట ఏవోగా, కె.మన్మథరావు పాలకొండ నుంచి సరుబుజ్జిలి ఏవోగా, పి. శ్రీదేవి సీతంపేట నుంచి కవిటికి, కె.రవికుమార్ పాతపట్నం నుంచి జలుమూరుకు, బి.ధనుంజేయకు కంచిలి నుంచి వజ్రపుకొత్తూరుకు, కె.సంధ్యకు కొత్తురు నుంచి శ్రీకాకుళం ఏడీఏ కార్యాలయంకు, కె.శిరీష పలాస ఏడీఏ కార్యాలయం నుంచి నరసన్నపేట ఏడీఏ కార్యాయలంకు బదిలీ చేశారు. అలాగే వి. రాజేశ్వరరావును ఏడీఏ కార్యాలయం శ్రీకాకుళం నుంచి ఎచ్చెర్ల ఏవోగా, బి. రవికుమార్ కొత్తూరు నుంచి ఎస్‌టీఎల్ ఆమదాలవలసకు, పి. లతశ్రీ ఎల్ఎన్‌పేట నుంచి ఏవో ఎస్‌టీఎల్ ఆమదాలవలసకు, వై.సూర్యకుమారి డీటీసీ శ్రీకాకుళం నుంచి నరసన్నపేట ఏవోగా, ఎన్. శ్రీనివాసరావు బూర్జ నుంచి టెక్కలి ఏవోగా, ఐ.భానుప్రియాంక ఏడీఏ టెక్కలి నుంచి అల్లూరు జిల్లా కోయ్యూరు ఏవోగా, జి.శ్రీలక్ష్మి సంతబొమ్మాళి నుంచి ఏడీఏ కార్యాలయం టెక్కలికి, వై. సురేష్ ఎచ్చెర్ల నుంచి డీటీసీ -శ్రీకాకుళంకు, పి. రేవతి భామిని నుంచి ఏడీఏ కార్యాలయం శ్రీకాకుళంకు, బి. బాబ్జి పొందూరు నుంచి జి. సిగడాంకు, కె. సురేష్ జలుమూరు నుంచి కంచిలి ఏవోగా, ఎస్. వినయ్‌కుమారి ఎస్‌టీఎల్ ఆమదావలస నుంచి (మిగతా 6వ పేజీలో..)

జీఎస్టీ వసూళ్లు పెరగాలి

- పన్ను పరిధిలోకి మరింతమంది వ్యాపారులు
- వస్తు సేవల వినియోగాన్ని ప్రోత్సహించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీఎస్టీ, ఇతర శాఖల అధికారులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీఎస్టీ వసూళ్లను పెంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన వాణిజ్య పన్నులశాఖ, వివిధ ప్రభుత్వ శాఖలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పన్ను పరిధిలోకి జీఎస్టీ కింద నమోదుకాని వ్యాపారులను తీసుకురావాలన్నారు. పన్నుల చెల్లింపు పరిధిని మరింత విస్తరించాలన్నారు. నమోదుకాని వర్తకుల వివరాలను వాణిజ్య పన్నుల శాఖకు అందించాలని ఆదేశించారు. పాత బకాయిల వసూళ్లలో రెవెన్యూ అధికారులు జీఎస్టీ అధికారులు సహకరించాలని కోరారు. పన్ను బకాయిదారులు, బిల్లర్ల వివరాలను కూడా జీఎస్టీ అధికారులకు అందించాలన్నారు. అలాగే అక్రమ రవాణాకు సంబంధించి మైనింగ్ అధికారులు వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. వస్తుసేవల వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. వృత్తి పన్ను వసూళ్లకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు, టెక్నికల్ ఎడ్యుకేషన్, మున్సిపల్ అధికారులు పన్నుల వసూళ్లలో భాగస్వాములు కావాలని ఆదేశించారు. సమావేశంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.నాగార్జునరావు, శ్రీకాకుళం సర్కిల్ ఏసీ గొలివి.రాణీమోహన్, ఆముదాలవలస ఏసీ సిహెచ్ కొండమ్మ, డిప్యూటీ ఏసీ బి.కామరాజు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒకటి రక్తం.. నలుగురికి ప్రాణాధారం

ప్రపంచంలో వైద్యరంగం సరికొత్త పుంతలు తొక్కుతున్నా.. నిపుణులు తయారు చేయలేని పదార్థాల్లో రక్తం ఒకటి. మనదేశంలో ఉన్న 140 కోట్ల మంది జనాభాను అత్యవసర సమయాల్లో రక్షించుకునేందుకు ఏటా సుమారు ఐదు కోట్ల యూనిట్ల రక్తం అవసరం అవుతోంది. కానీ, అందుబాటులో ఉన్నది కేవలం 50 లక్షల యూనిట్లు మాత్రమే. అందుకే అత్యవసర సమయాల్లో, ఆపదకాలంలో రక్తం అందక ఎంతో మంది మృత్యువాతపడుతున్నారు. రక్తదానంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు పెరగాల్సిన అవసరం ఉంది. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- రక్తదానం మహోన్నతం
- అవగాహన లేక ముందుకురాని దాతలు
- ఆరోగ్యవంతులు ఎన్నిసార్లయినా చేయవచ్చు
- జిల్లాలో రక్తం కొరత
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

అరసవల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి)

ఒక వ్యక్తి రక్తం దానం చేస్తే నలుగురి ప్రాణాలను నిలబెట్టవచ్చు. దాత నుంచి సేకరించిన రక్తాన్ని హోల్ బ్లడ్ అంటారు. ఆ రక్తంలో ప్లాస్మా, ప్లేట్‌లెట్స్, ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు ఉంటాయి. వీటిని విడదీసి నలుగురికి ఎక్కించవచ్చు. ఒక వ్యక్తి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్లాస్మాతో పాటు ప్లేట్‌లెట్స్ సైతం దానం చేయవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉన్న 18 సంవత్సరాలు నిండిన వారు రక్తదానం చేయవచ్చు. 18ఏళ్ల నుంచి క్రమం తప్పకుండా రక్తదానం చేస్తే జీవితకాలంలో దాదాపుగా 168 సార్లు రక్తదానం చేయవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. బరువు 45 కిలోలు పైబడిన వారు, బీపీ అదుపులో ఉన్నవారు రక్తదానం చేయవచ్చు. తీవ్రమైన వ్యాధులు, మూర్ఛ, మూత్రపిండ వ్యాధిగ్రస్తులు, అలర్జీ ఉన్నవారు, అసాధారణ రక్తప్రసరణ లక్షణాలు, త్వరితగతిన బరువు కోల్పోవడం, హృదయ సంబంధ వ్యాధిగ్రస్థులు, ఇతర ప్రమాదకరమైన వ్యాధులు లేనివారు రక్తదానం చేయవచ్చు. రక్తదానం చేసినవారికి ఆరోగ్యపరంగా కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. రక్తదానం వల్ల పెద్దపేగు, ఊపిరితిత్తులు, కాలేయం, గొంతు క్యాన్సర్ వచ్చే అవకాశం తగ్గుతుంది. గుండె సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. రక్త దానంపై చాలా అపోహలు ఉంటాయి. రక్తదానం చేస్తే ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుందని ఎక్కువ మంది భయపడుతుంటారు. కానీ, అటువంటిదేమీ ఉండదు. రక్తదానం చేసిన రెండు రోజులకే దయనందిన పనుల్లో నిమగ్నం కావొచ్చు. రక్తదానం చేసే సమయంలో చిన్న సూది నొప్పి తప్పించి ఏ ఇబ్బంది ఉండదు. రక్తదాతకు ముందుగా వైద్య పరీక్షలు చేస్తారు. ఆయన శరీరంలో సరిపడినంత కంటే ఎక్కువ రక్తం ఉంటేనే సేకరిస్తారు. రక్తదానం తరువాత ఆరు వారాల్లోపు ఆ వ్యక్తి శరీరంలో కొత్త రక్తం తయారవుతుంది.

ప్రత్యేక యాప్..

రక్తదానం చేసేవారికి ప్రత్యేకంగా ఒక యాప్ అందుబాటులో ఉంది. జాతీయ ఆరోగ్య మిషన్ ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'ఈరక్తకోష్' అనే యాప్‌లో వివరాలు నమోదుచేసి రక్తం దానం చేయవచ్చు. మరోవైపు రెడ్‌క్రాస్ జిల్లా యూనిట్ల ద్వారా కూడా రక్తదానం చేయవచ్చు. ప్రతి జిల్లాలోనూ రెడ్‌క్రాస్ యూనిట్లు ఉంటాయి. అక్కడ ప్రతినిధులతో పాటు వలంటీర్లు ఉంటారు. వారిని సంప్రదించి రక్తదానం చేయవచ్చు. అయితే రక్తదానంపై రెడ్‌క్రాస్‌తో పాటు స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. కానీ, ఎందుకో ఆశించిన స్థాయిలో రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావడం లేదు. జనాభాలో నూటికి 2 నుంచి 5 శాతం మంది మాత్రమే రక్తదానానికి ముందుకొస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం ఈ విషయంలో పటిష్ట చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేస్తే ఎంతో మంది విలువైన ప్రాణాలు నిలబెట్టవచ్చు.



టెక్కలి: రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లాలో తీవ్ర కొరత..

జిల్లాలో రక్తం కొరత తీవ్రంగా ఉంది. శ్రీకాకుళం, సరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేటలో 10 రక్తసేకరణ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 27 లక్షల జనాభా ఉండగా, ప్రతీ ఏడాది సుమారు లక్ష పదివేలు యూనిట్ల రక్తం అవసరం. కానీ, ఈ పది కేంద్రాల ద్వాఆ సుమారు 20వేల యూనిట్ల రక్తసేకరణ మాత్రమే జరుగుతోంది. ఈ నేపథ్యంలో మరింత మంది అవగాహనతో రక్తదానం చేయడానికి ముందుకు రావాల్సి ఉంది. ముఖ్యంగా యువత రక్తదానం చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

రక్తదానంతో ఆరోగ్యం..



నేను ఇప్పటి వరకు 50 సార్లు రక్తదానం చేశా. కనీసం 100 సార్లు రక్తదానం చేయాలన్నదే నా కోరిక. ఒకసారి చిన్నమంగళాపురం నుంచి నిరుపేద గర్భిణి ప్రసవం కోసం శ్రీకాకుళం ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. శస్త్రచికిత్స ద్వారా ప్రసవం చేసేందుకు రక్తం అవసరం పడింది. నాకు ఆ విషయం తెలిసి వెంటనే ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశాను. ఖర్చుల కోసం రూ.500 కూడా వారికి ఇచ్చాను. మనం చేసే రక్తదానం మరో ఇద్దరి ప్రాణాలను కాపాడుతుంది. రక్తదానంతో నేను ఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్నాను.

-పూణ్ణ వెంకట రమేష్, మార్కెటింగ్ ఉద్యోగి, శ్రీకాకుళం

నేను ముందుంటా..



సోంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నాది ఏ-పాజిటివ్ గ్రూపు. ఎవరికైనా రక్తం అవసరం అన్న విషయం తెలిస్తే చాలు నేను ముందుకు వస్తుంటా. 2012 నుంచి ఇప్పటివరకు 20సారు రక్త దానం చేశా. పట్టణంలోని అన్నపూర్ణ ఆసుపత్రిలో ఓ వ్యక్తికి రక్తం ఆరు పాయింట్లు ఉండి ప్రాణాపాయ స్థితిలో ఉండగా నేను వెళ్లి రక్తం దానం చేశా.

-ఎర్ర వాసు, రాజుగారిపేట, సోంపేట

ఆర్‌పీ ఫౌండేషన్ ద్వారా..



ఆర్‌పీ ఫౌండేషన్ నిర్వహించిన రక్తదాన శిబిరం (ఫైల్)

సరుబుజ్జిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు రేపటి ప్రయోజనం (ఆర్‌పీ) ఫౌండేషన్ అనే సంస్థను ఏర్పాటు చే సి విరివిగా రక్త సేకరణ చేపడుతున్నారు. రాగోలు జెమ్స్, శ్రీకాకుళం లయన్స్, విజయనగరం విజయబ్లడ్ బ్యాంక్, విశాఖ పట్నం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో ఆర్‌పీ ఫౌండేషన్ సంస్థ సభ్యులు సుమారు 200 యూనిట్ల రక్తాన్ని ఇప్పటివరకు సేకరించారు.

ఎంతో సంతృప్తి నిచ్చింది..



ఆమదాలవలస, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నేను ఇప్పటి వరకు 17సార్లు రక్తదానం చేశాను. 1992లో మొదటిసారి కోటబొమ్మాళిలో రక్తదానం చేశాను. అప్పటినుంచి టీడీపీ, స్వచ్ఛంద సంస్థలు, పలు ఆసుపత్రులు నిర్వహించే శిబిరాల్లో పాల్గొని రక్తదానం చేస్తుంటా. 1994లో కోటబొమ్మాళి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన అల్లు రాజారావు అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీ వ్రంగా గాయపడ్డాడు. ఆయన ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు నేను రక్తదానం చేశాను. అది నాకు ఎంతో సంతృప్తినిచ్చింది.

-రెడ్డి రాంబాబు, 20 వార్డు వెంగళరావు కాలనీ, ఆమదావలస

పుట్టిన రోజు నాడు రక్తదానం..

టెక్కలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చాలామంది యువకులు తమ పుట్టినరోజు నాడు కేక్‌లు కట్ చేసుకోవడం, పార్టీలు చేసుకోవడం వంటివి చేస్తుంటారు. కానీ, టెక్కలి గొల్లవీధికి చెందిన బర్ల కార్తీక్ అనే యువకుడు మాత్రం తన పుట్టినరోజును పురస్కరించుకొని స్థానిక శుభం కల్యాణమండపంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశాడు. ఆయనతో పాటు మరో 110మంది రక్తదానం చేశారు. ఈ శిబిరంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి వైద్యురాలు సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

38సార్లు రక్తదానం..

ఎచ్చెర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎంపురం గ్రామానికి చెందిన డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్ ఇప్పటి వరకు 38 సార్లు రక్తదానం చేశారు. 2008లో ఆయన నూజివీడులో బీటెక్ చదువుతుండగా స్నేహితుని తండ్రికి గుండె ఆపరేషన్ జరగడంతో తొలిసారిగా అవినాష్ రక్తదానం చేశారు. ప్రతి ఏటా ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టిన రోజు, కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి, వర్ధంతి, తన తాతయ్య స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ శాసనసభ్యుడు చౌదరి సత్యన్నారాయణ జయంతి నాడు అవినాష్ రక్తదానం చేస్తుంటారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన అవినాష్‌ను ఎచ్చెర్ల శాసనసభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఇటీవల అభినందించారు. గత కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్ చేతుల మీదుగా అవార్డు కూడా అందుకున్నారు.



రక్తదానం చేస్తున్న చౌదరి అవినాష్



అమ్మ ఆనందం

- బ్యాంకు ఖాతాల్లో తల్లికి వందనం నిధులు
- ఒక్కొక్కరికీ రూ.13 వేల చొప్పున జమ
- టీడీపీ ఎన్నికల హామీ అమలు
- పేదల ఇళ్లలో సందడే సందడి

రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పేరిట శుక్రవారం తల్లుల ఖాతాలకు నగదు జమ చేసింది. సీఎం చంద్రబాబు చెప్పినట్టుగానే ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమందికీ తల్లికి వందనం వర్తింపజేశారు. ఇద్దరే కాదు నలుగురు పిల్లలున్నా కూడా ఒక్కొక్కరికీ రూ.13 వేల చొప్పున అందించారు. దీంతో తల్లుల ఆనందానికి అవధుల్లేవు. 'తల్లికి వందనం' పథకంపై వారి మాటల్లోనే..

జీడి కార్మికుల పిల్లలకు..



భార్గవి, మల్లిక, వైష్ణవి

పలాస, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మొగిలిపాడు గ్రామానికి చెందిన జీడి కార్మికులు సవర రోజా, నర్సింగరావుకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె భార్గవి 8, రెండోకుమార్తె మల్లిక 6, మూడో కుమార్తె వైష్ణవి 3వ తరగతి చదువుతున్నారు. వీరికి తల్లికి వందనం కింద రూ.13వేలు చొప్పున మొత్తం రూ.39వేలు రోజా బ్యాంకు ఖాతా లో జమైంది. తమ పిల్లల చదువు కు తల్లికివందనం ఎంతో వినియోగపడుతుందని తల్లిదండ్రులు తెలిపారు.

పిల్లల చదువుకు వినియోగిస్తాం..



ముగ్గురు పిల్లలతో లక్ష్మి, ఉమాశంకర్ దంపతులు

నందిగాం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నందిగాం కారిగుడ్డి వీధికి చెందిన నర్సిపురం లక్ష్మికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. లక్ష్మి పెద్దకుమార్తె పూజిత ఎనిమిది, రెండో కుమార్తె మోహిత ఆరు, కుమారుడు రోహిత్ మూడో తరగతి చదువుతున్నారు. ముగ్గురు పిల్లలకు సంబంధించి రూ.13వేలు చొప్పున మొత్తం రూ.39వేలు లక్ష్మి బ్యాంకు ఖాతాకు జమయ్యాయి. ఈ కుటుంబం స్థానికంగా చికెన్ సెంటర్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ నగదును పిల్లల చదువు కోసం వినియోగిస్తామని లక్ష్మి, ఆమె భర్త ఉమాశంకర్ తెలిపారు.

పేద కుటుంబంలో ముగ్గురికి..



పిల్లలతో భారతి

పలాస, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మొగిలిపాడు గ్రామంలో తామాడ భారతి, లక్ష్మణరావు అనే నిరుపేద కుటుంబం నివాసం ఉంటుంది. వారి పిల్లలు ఇందు ఎనిమిది, లావణ్య ఆరు, కుమారుడు బాలరాజు నాల్గో తరగతి) చదువుతున్నారు. వీరికి సంబంధించి భారతి బ్యాంకు ఖాతాల్లో రూ.39వేలు జమయ్యాయి. గత వైసీపీ పాలనలో ఒక్కరికే మాత్రమే అమ్మవడి పథకం వర్తించిందని, కూటమి ప్రభుత్వంలో తమ ముగ్గురు పిల్లలకూ తల్లికి వందనం రావడం ఆనందంగా ఉందని భారతి, లక్ష్మణరావు తెలిపారు. వీరితో పాటు మొగిలిపాడుకు చెందిన దున్న శంకర్ పిల్లలు హేమలత, పవిత్ర, శిరీషకు కూడా తల్లికివందనం పథకం వర్తించింది.

సంతోషంగా ఉంది..

కాశీబుగ్గ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం పథకం కింద నా ముగ్గురు పిల్లలకు రూ.13వేలు చొప్పున ప్రభుత్వం అందించడం చాలా సంతోషంగా ఉంది.' అని కాశీబుగ్గ 13వ వార్డు చేపల మార్కెట్‌కు చెందిన బెలమేర కరిమీని అన్నారు. ఈమె పెద్ద కుమార్తె అనుష్క ఇంటర్, రెండోకుమార్తె కార్తిక ఆరు, కుమారుడు శశాంత్ రెండో తరగతి కాశీబుగ్గలో చదువుతున్నారు. మొత్తం రూ.39వేలు తన బ్యాంకు ఖాతాలో జమైనట్లు కరిమీని తెలిపారు.



పిల్లలతో కరిమీని

పాతపట్నం మాదిగ వీధిలో..



కృష్ణారావు, లక్ష్మమ్మ దంపతులతో పిల్లలు

పాతపట్నం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మేజర్‌పంచాయతీ పాతపట్నం మాదిగవీధికి చెందిన లోలుగు కృష్ణారావు, లక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె సావిత్రి స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి, పెద్ద కుమారుడు కౌషిక్ స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఆరో తరగతి, చిన్న కుమారుడు గణేష్ స్థానిక పిల్లివీధి ఎంపీపీ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఒక్కొక్కరికి రూ.13వేలు చొప్పున లక్ష్మమ్మ ఖాతాలో రూ.39వేలు నగదు జమకావడంతో ఆ కుటుంబంలో ఆనందోత్సాహాలు నిండుకున్నాయి.

అమ్మ ఆనందం

(ఐదో పేజీ తరువాయి)

నలుగురు పిల్లలు.. ముగ్గురు పిల్లలు.. ఇద్దరు పిల్లలు ఉండి.. వారు చదువుకుంటే వాళ్లందరికీ పథకం వర్తింపజేశారు. ఒక్కొక్కరికి రూ. 13వేల చొప్పున తల్లుల ఖాతాల్లో నగదు జమ అయింది. తల్లులు తమ బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగువారితో తమ సంతోషాన్ని పంచుకున్నారు. స్థానిక టీడీపీ నాయకులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హిరమండలంలో సుభలయకాలనీకి చెందిన షేక్‌షబీనా, షేక్‌యూసఫ్ దంపతులకు ముగ్గురు పిల్లలు. వారిలో హతీజా ఆరో తరగతి, షేక్ హబీబ్ నాలుగో తరగతి, షేక్ సల్మా రెండో తరగతి చదువుతున్నారు. ఈ ముగ్గురికి 'తల్లికి వందనం' లబ్ధి చేకూరింది. తల్లి షేక్ షబీనా బ్యాంకు ఖాతాలో రూ. 39వేల నగదు జమ అయింది. అలాగే హిరమండలంలో కూర్మాపు ఉమకు ముగ్గురు కుమార్తెలు. మాధవి ఏడో తరగతి, రజని 10వ తరగతి, ప్రియాంక 9వ తరగతి చదువుతున్నారు. వీరికి పథకం వర్తించింది. ఉమ బ్యాంకు ఖాతాలో రూ. 39వేలు జమ అయింది. మొత్తం 1,52,563 మంది తల్లులను తొలివిడతగా గుర్తించారు. విద్యార్థులు 2,28,659 మందిగా నిర్ధారించారు. అత్యధిక శాతం తల్లుల ఖాతాల్లో తొలిరోజునే నగదు జమఅయిపోయింది.

మండల వ్యవసాయశాఖ అధికారుల బదిలీ

(ఐదో పేజీ తరువాయి)

డీటీసీ శ్రీకాకుళంకు, ఆర్.అప్పారావు ఏడీఏ కార్యాలయం సోంపేట నుంచి సంతబొమ్మాళి ఏవోగా, వై. శివశంకర్‌రెడ్డి ఎస్‌టీఎల్ ఆమదాలవలస నుంచి జేడీఏ భూసార కేంద్రం గుంటూరుకు, ఎల్. మురళీధర్ ఎస్‌డీవో శ్రీకాకుళం నుంచి కొత్తూరుకు, డి. ఉషారాణి ఏడీఏ కార్యాలయం శ్రీకాకుళం నుంచి బూర్జ ఏవోగా బదిలీపై వెళ్లారు. బి. పద్మనాభం సరుబుజ్జిలి ఏవో నుంచి ఎస్‌టీఎల్ కేంద్రం ఆమదాలవలసకు, శ్రీనివాసరామ అప్పారావుకు జి.సిగడాం నుంచి పాడేరు ఏవోగా, కె. సునీత నరసన్నపేట నుంచి డీఏవో కార్యాలయ ఏవోగా, పి. కిరణ్‌వాణి వజ్రపుకొత్తూరు నుంచి పాతపట్నం ఏవోగా, డి. రూపకు కవిటి నుంచి చోడవరం ఏవోగా, వై.విద్య డీఏవో కేంద్రం నుంచి ఏడీఏ కార్యాలయం టెక్కలికి బదిలీ అయ్యారు. హరివెంకటకు ఏడీఏ కార్యాలయం టెక్కలి నుంచి ఎస్‌ఎంఎఫ్- యార్డు ఫాం పెద్దపేటకు, టి. భార్గవి ఇచ్ఛాపురం నుంచి పాడేరుకు, ఎం.నవీన్ సంతకవిటి నుంచి శ్రీకాకుళం ఏవోగా, రేణుకసాయి రాజాం నుంచి డీఆర్‌సీ ఏవోగా, కె. శిరీష నరసన్నపేట ఏడీఏ కార్యాలయం నుంచి సీతంపేట భూసార విభాగపు ఏవోగా, జి.రంగారావును టెక్కలి ఏవో నుంచి అరకు జిల్లా అనంతగిరి ఏవోగా, ఎం.ఉషాకుమారి శ్రీకాకుళం నుంచి కొత్తూరు భూసార పరీక్షా కేంద్ర ఏవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వేటకు వేళాయే!

(ఐదో పేజీ తరువాయి)

పనికి కుదురుతున్నారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత హార్బర్లతో పాటు జెట్టీల నిర్మాణంపై దృష్టి సారించింది. వీలైనంత త్వరగా వాటి నిర్మాణ పనులు పూర్తిచేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు..

కూటమి ప్రభుత్వ రెట్టింపు భృతి అందించింది. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు. వేటకు వెళ్తేనే కుటుంబానికి పూట గడిచేది. లేకుంటే పస్తులే మిగులుతాయి. తుఫాన్లు, వాతావరణం సరిగ్గా లేనప్పుడు రోజుల తరబడి ఇంటి వద్దే ఉండిపోతాం. కనీసం ఉపాధి హామీ పనులు ఉంటే కొంత ఇబ్బందులు తీరుతాయి. ప్రభుత్వానికి, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఉపాధి పనులు మాత్రం కల్పించలేదు.

-మైలపల్లి అప్పారావు, మత్స్యకారుడు

కొంత స్వాంతన..

కూటమి ప్రభుత్వం భృతి రెట్టింపు చేయడంతో కొంత స్వాంతన చేకూరింది. స్థానికంగా వేట గిట్టుబాటు కలగడం లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. తప్పనిసరైతే సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. కుటుంబాలను విడిచిపెట్టి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం జిల్లాలో హార్బర్లు, జెట్టీల నిర్మాణం పూర్తిచేయాలి.

-సూరాడ అప్పన్న, మత్స్యకారుడు

జీడి పరిశ్రమల బంద్ తగదు

- తక్షణమే వాటిని తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలి
- జీడి-రైస్ మిల్ కార్మిక సంఘం

పలాస, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గలో జీడి పరిశ్రమలను బంద్ చేయడం తగదని, తక్షణమే వాటిని తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలని జీడి-రైస్‌మిల్లర్స్ కార్మిక సంఘం అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సానా ఈశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక భవన్‌లో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారం రోజులే జీడి పరిశ్రమలను బంద్ చేయాలని తాము కోరినా వ్యాపార సంఘం పట్టించుకోకుండా రెండు వారాల పాటు పరిశ్రమలను మూసివేసిందన్నారు. దీంతో పనుల్లేక కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు నష్టాల్లో ఉన్నాయని, జీడి పప్పు నిల్వలు పేరుకుపోయాయని, పరిశ్రమలు బంద్ చేస్తే వ్యాపారం గాడిలోకి వస్తుందని వ్యాపారులు కొత్త నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. ఇక్కడ బంద్ అని చెబుతూ గ్రామీణ ప్రాంతాల్లో వారి సరుకులు ఇచ్చి పీలింగ్ చేస్తున్నారని ఆరోపించారు. కేవలం కార్మికుల పొట్టకొట్టడానికే ఈ విధంగా చేశారని అన్నారు. ఆదివారంతో రెండు వారాల గడువు ముగుస్తుందని, సోమవారం నాటికి పరిశ్రమల తెరిపించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే అదేరోజు నుంచి జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం (పీసీఎంఏ) భవనం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్మికసంఘం నాయకులు బొంపల్లి సింహాచలం, కోనారి రాము, బి.భామారావు, నాగేశ్వరరావు, మోహనరావుతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయులు ఆదర్శం

- పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన వైనం

టెక్కలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న టి.రెయ్యన్నకు ఇటీవల కవిటి మండలం ఆర్.బెలగాం పాఠశాలకు బదిలీ అయింది. దీంతో ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తన ఇద్దరు పిల్లలను ఆర్.బెలగాం పాఠశాలలో చేర్పించారు. కుమారుడు హైజాక్ తొమ్మిదో తరగతి, కుమార్తె జీవన జ్యోతిని ఆరో తరగతిలో చేర్పించి రెయ్యన్న ఆదర్శంగా నిలిచారు. అలాగే పోలవరం నుంచి పాతటెక్కలి బదిలీ అయిన సైన్స్ ఉపాధ్యాయురాలు టి.లేపాక్షి కూడా తన కుమారుడు ముకేష్‌ను ఇదే పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపవిద్యా శాఖాధికారి విలియమ్స్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన ఉత్తమ విద్యాబోధన, భోజన సౌకర్యం, నాణ్యమైన విద్యామిత్ర కిట్లు అంది స్తుండడంతో పిల్లలు చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.



పోలవరం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో చేరిన ఉపాధ్యాయుల పిల్లలు

యోగా జీవితంలో భాగంగా ఉండాలి


ఆసనాలు వేస్తున్న దృశ్యం

పాత శ్రీకాకుళం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): యోగా జీవితంలో భాగంగా ఉండాలని జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ అన్నారు. నగరంలోని 80 అడుగుల రహదారిలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగాపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతిరోజు ఇంటి వద్దనే యోగాసనాలు చేసుకోవచ్చన్నారు. యోగాసనాలు వేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపరుచుకోవచ్చన్నారు. యోగాసనాలతో వ్యాధులు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు పొండ్రంకి మురళీకృష్ణ, ఆయుష్ ప్రతినిధి చంద్రశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ హరీష్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది, నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

16న శ్రీకూర్మంలో యోగాంధ్ర

గార, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలో ఈ నెల 16వ తేదీ సోమవారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు, తహసీల్దార్ ఎం.చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు


సాధన చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని పతాంజలి యోగాపీఠం హరిద్వార్ నుంచి వచ్చిన స్వామి రీతాజీ మహరాజు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, కమిషనర్ ఎన్.రమేష్, పతాంజలి యోగా గురువు సంజీవ్‌రెడ్డి, సచివాలయ, ఉద్యోగులు పాల్గొన్నారు

వైసీపీ కనుమరుగు ఖాయం: రవికుమార్

ఆమదాలవలస, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకుంటున్న వైసీపీ నేతలకు ప్రజల నుంచి చీత్కారాలు తప్పవని, తద్వారా ఆ పార్టీ రాష్ట్రంలో కనుమరుగు అవ్వడం ఖాయమని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని పూర్తిస్థాయి పీకల్లోతు అప్పుల్లో ముంచి ప్రజలకు అరకొర సంక్షేమ పథకాలు అందించి వైసీపీ అవినీతి నేరస్థులు ప్రజాధనాన్ని దోపిడీ చేశారని విమర్శించారు. ఎంతో ముందుచూపుతో పరిపాలన చేస్తున్న విజన్ ఉన్న నేత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని, ఆ స్థాయిని మరిచి వైసీపీ సైకోలు విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఇటీవల మాజీ మంత్రి బొత్స కూటమి ప్రభుత్వం అందిస్తున్న తల్లికివందనం పథకంపై అసత్య ఆరోపణలు చేయడం బాధాకరం అన్నారు. విమాన ప్రమాద ఘటన దురదృష్టకరమని, ఈ ప్రమాదంలో మరణించినవారి ఆత్మకు శాంతి చేకూర్చాలన్నారు. మృతుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొదలవలస రమేష్, అన్నెపు భాస్కరరావు, కూన ఆంజనేయులు, కోరుకొండ రమణమూర్తి, కూన రమేష్, నాగళ్ల మురళీధర్ యాదవ్, ఎండ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తండ్రి సింహాచలం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శుక్రవారం టీడీపీ కార్యదర్శి సాలిన ఢిల్లీయాదవ్ విశాఖ వెళ్లి శ్రీనివాస్ కలిసి పరామర్శించారు. ఈయన వెంట ప్రదీప్, మోహన్ తదితరులు పాల్గొన్నారు

రైతులకు అందుబాటులో విత్తనాలు

ఇచ్ఛాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలం మునిసిపాలిటీ పరిధిలోగల రైతులకు కావల్సిన విత్తనాలు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఇప్పటికే పలు పంచాయతీల్లో విత్తనాలు పంపిణీ జరుగుతుందని రైతులు ద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి టి.భార్గవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు వచ్చిన 700క్వింటాల విత్తనాల్లో 80శాతం పంపిణీ పూర్తి చేశామని, మరో వారం రోజుల్లో విత్తనాలు పంపిణీ పూర్తి చేస్తామన్నారు. శుక్రవారం తేలుకుంచి గ్రామంలో రైతులకు ఎంపీటీసీ టీడీపీ సీనియర్ నాయకులు మేరుగు సూర్యనారాయణ చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎం.నారాయణరెడ్డి, ఎం.హరికృష్ణ డి.శ్రీనువాస్, నూకరాజు, పురుషోత్తం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వృద్ధులపై వివక్ష మానవ హక్కుల ఉల్లంఘనే

శ్రీకాకుళం లీగల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వృద్ధులపై వివక్ష చూపితే అది మానవ హక్కుల ఉల్లంఘన కిందే వస్తుందని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.శ్రీధర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమీపంలో శాంతా అనురాగ కల్యాణ్ నిలయంలో వృద్ధుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. భవిష్యత్తుకు బాటలు వేసిన వృద్ధులను కుటుంబ సభ్యులు నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమన్నారు. ఇది మానవ హక్కుల ఉల్లంఘనే అన్నారు. వృద్ధుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు చట్టాలు, పథకాల గురించి ఈ సందర్భంగా వివరించారు. తమ జీవితాంతం వారు కుటుంబానికి చేసిన త్యాగాలను గుర్తుచేస్తూ వారిని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. వృద్ధులకు ఏదైనా వేధింపులు ఎదురైతే సంబంధిత న్యాయ సేవాధికార సంస్థను తక్షణమే సంప్రదించాలని స్పష్టం చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు టి.శివప్రసాద్, పి.దామోదర్, జి.ఇందిరాప్రసాద్, ఆశ్రమ ఇన్‌చార్జి సాయిసుదర్శన్ పాల్గొన్నారు.

నీటి వృథా అరికట్టండి

కవిటి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కవిటిలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా తాగునీరు వృథాగా పోతున్నా ఎవరికీ పట్టడం లేదు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళలో పైపులైను లీకుతో తాగునీరు రోడ్డుపై వరదలా పారుతుంది. రాజపురం రోడ్డులో ఉన్న ప్రధాన ట్యాంకుకు నీటిని అందించే ఈ లైన్‌లో లీకులు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.



అంతిమ సంస్కారానికీ ఆటంకమే!

- శ్మశానవాటిక లేక ఇబ్బంది
- వెంకటరావుపేట వాసులకు తప్పని అవస్థలు


వివాదానికి కారణమైన పాత శ్మశాన వాటిక


వేరొక చోట దహన సంస్కరణలు చేస్తున్న దృశ్యం

లావేరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో ఎవరు చెనిపోయినా ఒకటే ఆందోళన.. అంతిమ సంస్కారాలు ఎలా చేయాలన్నదే. ఎందుకంటే ఆ గ్రామానికంటూ శ్మశానవాటిక లేకపోవడమే. దీంతో ఆ గ్రామంలో దహన సంస్కరణలు చేయడం పెద్ద శవాలుగానే చెప్పుకోవచ్చు. దశాబ్దాలుగా ఈ సమస్య ఉన్నా పరిష్కారానికి నోచుకోలేదు. ఈ క్రమంలో గ్రామంలో ఓ వృద్ధురాలు చనిపోతే అంతిమ సంస్కరణలకు 24 గంటలపాటు నిరీక్షించాల్సి వచ్చింది. చివరికి పోలీసులు, రెవెన్యూ అధికారుల చొరవతో అంతిమ సంస్కర ణలు పూర్తి చేశారు. లావేరు మండలం చిగిరికొత్తపల్లి పంచాయతీ వెంకటరావుపేట (పిన్నింటిపేట)లో ఈ సమస్య ఎదురైయింది. ఈ గ్రామంలో ఎవరు చనిపోయినా ఇక్కడి సమీపంలోని బెజ్జిపురం రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 248-8పీ 93 సెంట్లు జిరాయితీ స్థలం ఉంది. ఈ స్థలం ఓ ప్రైవేటు వ్యక్తికి చెందినది. ఇందులోని 8 నుంచి 10 సెంట్ల వరకు సమీపంలోని వెంకటరావుపేట గ్రామస్థులు శ్మశానవాటికగా ఉపయోగించుకుంటున్నారు. దాదాపు వందేళ్లుగా ఇదే కొనసాగుతోంది. అయితే వెంకటరావుపేటకు చెందిన జగ్గు రోతు పార్వతమ్మ(73) రెండు రోజుల కిందట కన్నుమూచింది. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు ఎప్పటిలాగే శ్మశానవాటికలో దహన సంస్కారానికి ఏర్పాట్లు చేస్తుండగా.. ఆ స్థల యజమాని అడ్డుకున్నారు. దీంతో గ్రామపెద్దలు, కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినలేదు. దీంతో వారు పోలీసు, రెవెన్యూ అధి కారుల దృష్టికి తీసుకువెళ్లారు. రెవెన్యూ అధికా రులు అక్కడికి చేరుకుని ఆ స్థల యజమా నికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలి తం లేకపోయింది. దీంతో చేసేదేమీ లేక రెవెన్యూ అధికారులు ఆ గ్రామా నికి కాస్త దూరంలో గల ఓ ప్రభుత్వ స్థలంలో దహన సంస్కరణలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ల గడుస్తున్నా నేటికీ ఆ గ్రామానికి శ్మశానవాటిక లేకపోవడంతో ఆ గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంకటరావుపేట గ్రామానికి శ్మశానవాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

సెంటు భూమి ఉన్నా 'అన్నదాత సుఖీభవ' అందిస్తాం

- పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకాన్ని సెంటు భూమి ఉన్న ప్రతి రైతుకు అందిస్తామని రాష్ట్ర పీయూసీ చైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శుక్రవారం రొట్టవలస గ్రామ సచివాలయ పరిధిలో రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం తప్పుడు గణాంకాలతో సంక్షేమ పథకాలు అందించేదని, దానికి భిన్నంగా నేటికీ కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు రెట్టింపు సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తి చేయడంపై చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ దృష్టిసారించారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.మధుసూదనరావు, ఎంపీడీవో పావని, వ్యవసాయాధికారి బి.పద్మనాభం, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, టీడీపీ నాయకులు తాడేల వెంకటరమణ, తాడేల రాజారావు, కిల్లి సిద్దార్థ, తర్లాడ సురేంద్ర, నందివాడ గోవిందరావు, అంబళ్ల రాంబాబు, నూక ప్రభాకర్ పాల్గొన్నారు. ఇదిలావుంటే డీసీసీబీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతు చేపట్టిన శివ్వాల సూర్యనారాయణను రొట్టవలస గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తాడేల వెంకటరమణ, తాడేల రాజారావు, తాడేల గోవిందరావు, బెవర రాజారావు, గ్రామస్థులు గజమాలతో సత్కరించారు.

వార్డుల్లోని ప్రధాన సమస్యలు పరిష్కరించండి


కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న దాసరి రాజు

ఇచ్ఛాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో గల పలు వార్డుల్లో పేరుకుపోయిన ప్రధాన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు అధికారులను కోరారు. ఈమేరకు శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.రమేష్ వినతి పత్రాన్ని అందజేశారు. 22వ వార్డు సత్యసాయి స్ట్రీట్ శాంతినికేతన్ రోడ్డు డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంది. 15 ఏళ్ల కిందట వేసిన కొళాయిలు కావడంతో సక్రమంగా నీరు రావడం లేదని, అందువల్ల తక్షణమే పనులు చేపట్టాలని కోరారు. అలాగే 20వ వార్డు కొండపోలమ్మ కాలనీ ఏర్పాడి సుమారుగా 25 ఏళ్ల దాటింది. ఇంతవరకు ఈ కాలనీలో రోడ్లు కానీ, డ్రైనేజ్ కాని స్ట్రీట్ లైట్లు కాని లేవు. దీంతో ప్రలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 10వ వార్డులో ప్రధాన వీధుల్లో రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణం చేపట్టాలి, మునిసిపాల్టీ పరిధిలో గల 23 వార్డుల్లో స్ట్రీట్ లైట్లు సరిగ్గా పనిచేయడం లేదు. వెంటనే లైట్లు బాగుచేయాలని కోరారు. శుక్రవారం నిర్వహించిన మునిసిపల్ షాపుల వేలం పాటల విషయంలో ప్రజలకు పూర్తిస్థాయిలో సమాచారం లేదని, ప్రజలకు పూర్తిస్థాయిలో సమాచారం అందజేసి మళ్లీ వేలం పాటలు నిర్వహించాలని కోరారు కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పన దుర్యోధనరెడ్డి, రోకళ్ల వాసు, ప్రేమ్‌కుమార్, కలియా, శ్యామ్, రుక్మాంగదరావు తదితరులు పాల్గొన్నారు

వారి ఆత్మకు శాంతి కలగాలని హోమం


హోమం చేయిస్తున్న స్వామి శ్రీనివాసానంద

పొందూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ సాధు పరిసత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద అన్నారు. ఈ మేరకు విమాన ప్రమాదంలో మృతి చెందినవారి ఆత్మలకు శాంతి కలగాలని కృష్ణాపురంలో గల ఆనందాశ్రమంలో శుక్రవారం శాంతిహోమం నిర్వహించారు. ప్రయాణికులతో పాటు మృతిచెందిన వైద్యులు, వైద్యవిద్యార్థుల ఆత్మకు శాంతికలగాలని కోరారు.

చంద్రబాబు పాలన ఆదర్శం


చంద్రబాబు చిత్ర పటానికి పాలభిషేకం చేస్తున్న దృశ్యం

రణస్థలం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుది ఆదర్శ పాలనని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకొని ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి తల్లికి వందనం పథకం వర్తించేలా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారన్నారు. శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటానికి లబ్ధిదారులతో పాలభిషేకం చేశారు. సూపర్ సిక్స్ అమలు చేసిన ఘనత చంద్రబాబునాయుడిదే అన్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన బాధాకరమని, ఈ తరుణంలో వైసీపీ నేతల తీరు రాక్షసులను తలపిస్తోందని విమర్శించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు లంక శ్యామలరావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారమే లక్ష్యం

- ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే గొండు శంకర్


ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రతీ సమస్యకు పరిష్కార మార్గం చూపించడమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టం చేశారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో గల పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ సమస్యకు సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారం అందేలా చూస్తామన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ముఖ్యంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో యువత పెద్ద ఎత్తున ఉద్యోగాల కోసం దరఖాస్తులు వస్తున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో మౌలిక వసతులైన డ్రైనేజీ, విద్యుత్తు, తాగు, సాగునీరు సమస్యలు వస్తున్నాయని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏడాది పాలనలో ప్రజల నుంచి మన్ననలు అందుకున్నామని, మరింత మెరుగైన అభివృద్ధి, సంక్షేమం అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం

రణస్థలం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రతి హామీ నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని, మధ్యాహ్నం భోజన పథకానికి సన్న బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఎంతమంది పిల్లలు చదివినా తల్లికి వందనం పథకం వర్తిస్తుందని, ఇప్పటికే చాలా మంది తల్లుల ఖాతాలు నగదు జమయిందన్నారు.

ఒలింపిక్ డే రన్‌పై సమావేశం రేపు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23వ తేదీన ఒలింపిక్ డే సందర్భంగా ఏర్పాట్ల కోసం ఈ నెల 15వ తేదీన సాయంత్రం 4 గంటలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం గల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా ఒ లింపిక్ సంఘం అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా ఒలింపిక్ అసో సియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని క్రీడా సంఘాలు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ప్రతి నిధులు ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు.


స్కాలర్‌షిప్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

ఎన్‌సీసీ క్యాడెట్లకు స్కాలర్‌షిప్స్

ఆమదాలవలస, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నలుగురు ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు రూ.6 వేలు చొప్పున సీడబ్ల్యూఎస్ స్కాలర్‌షిప్ అవార్డులకు ఎంపికయ్యారు. దీంతో 14-ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ ప్రసూన్ కుమార్ పాండా నుంచి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలో 14-ఆంధ్రా ఎన్‌సీసీ బెలాయిన్ యూనిట్ పరిధిలో ఉన్న జిల్లాలోని ఏ పాఠశాలకు దక్కని గౌరవం ఆమదాలవలస పాఠశాలకు దక్కిందన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ చూపించిన ప్రతిభకు గుర్తుగా క్యాడెట్ వెల్ఫేర్ సొసైటీ నుంచి రూ.6 వేలు చొప్పున నగదు పురస్కారాలు సాధించిన నలుగురు విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వేడివాయిస్ నుంచి క్యాడెట్ ప్రశాంత్‌కుమార్, క్యాడెట్ దిలీప్, జేడబ్ల్యూగర్ల్స్ నుంచి క్యాడెట్ ఢిల్లీశ్వరి, క్యాడెట్ శ్రీమణి ఎంపికయ్యారు. వారికి ఎన్‌సీసీ అధికారులు పి.మోహన్‌రావు, శరత్‌కుమారి తర్ఫీదు ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.అప్పలరాము, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులను స్థానికులు అభినందించారు.

సెల్‌ఫోన్ సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ రోడ్‌లోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి సంస్థలో సెల్‌ఫోన్ సర్వీసింగ్‌లో యువతకు ఉచిత శిక్షణ ఈ నెల 23వ తేదీన ప్రారంభిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎన్.రాంజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకులకు 30 రోజుల పాటు ఉచితంగా శిక్షణతో పాటు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పదో తరగతి చదివిన 19-45 ఏళ్ల లోపు గల యువకులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఆసక్తిగలవారు 79933 40407, 95534 10809 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

షాపుల వేలం పాట ఖరారు

ఇచ్ఛాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన షాపుల వేలం పాట పూర్తయిందని కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. బస్టాండ్ జంక్షన్ పరిధిలో గల 10షాపులకు వేలం పాటలు నిర్వహించగా 35మంది వేలం పాటల్లో పాల్గొన్నారని తెలిపారు. వేలం పాటలో పోటీ జరగ్గా అధికంగా పాడిన వారికి కేటాయించటం జరిగిందని, కౌన్సిల్ ఆమోదించిన తర్వాత షాపుల కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అప్పలస్వామి, ఆర్ఐ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ అంపైర్‌గా సాయినాథ్


మోహన్ సాయినాథ్

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు అంపైర్‌గా సంపతిరావు మోహన్ సాయినాథ్ ఎంపికైనట్టు జాతీయ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి నుంచి ఉత్తర్వులు అందాయి. ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురం గ్రామానికి చెందిన సాయినాథ్ గతంలో కూడా పలు టోర్నమెంట్లకు అంపైర్‌గా వ్యవహరించారు. ఈయన ఎంపిక పట్ల జిల్లా బ్యాడ్మింటన్ సంఘ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్, డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, గురుగుబెల్లి ప్రసాద్, అనిల్ రత్నాజీ, దామోదర్ తదితరులు అభినందించారు.

కులసంఘ భవనం ప్రారంభం

కవిటి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కవిటిలోని అగ్నికులక్షత్రియ సేవా సంఘ భవనాన్ని శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ, ఎమ్మెల్సీ ఎన్.రామారావు ప్రారంభించారు. జడ్పీ, మండల పరిషత్ నిధులు రూ.21 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాల్, సర్పంచ్ పి.లక్ష్మణరావు, ఎంపీపీ కె.పద్మ, కులపెద్ద పి.లక్ష్మణమూర్తి, వైసీపీ నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న విద్యార్థిని

ఇచ్ఛాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజునాడు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బాలికల జూనియర్ కళాశాల ఒకేషనల్ అధ్యాపకులు శాంతిశ్రీ పిలుపునిచ్చారు. శుక్రవారం పుట్టిన రోజు జరుపుకున్న విద్యార్థిని స్వాతితో కళాశాల ఆవరణలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు, అధ్యపకులు రజని, సుధాకర్, ప్రసాద్, సునీత, శాంతిశ్రీ పాల్గొన్నారు.

మహిళ మెడలోని గొలుసు చోరీ

శ్రీకాకుళం క్రైం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఘటన శుక్రవారం రాత్రి పీఎన్ కాలనీలో కలకలం రేపింది. బాధిత మహిళ, శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం నగరం పీఎన్ కాలనీ మూడో లైన్ కమలనివాస్‌కు చెందిన కల్లేపల్లి ఈశ్వరమ్మ ఫ్రెండ్స్ కాలనీలో తన బంధువు మృతి చెందడంతో పరామర్శకు వెళ్లారు. తిరిగి శుక్రవారం రాత్రి 8 గంటలకు ఇంటికి వచ్చి తలుపులు తీస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి తనమెడలో ఉన్న మూడున్నర తులాల బంగారం పుస్తెల తాడు తెంపుకుని వెళ్లిపోయాడు. బాధిత మహిళ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్రైం కార్నర్

మోటార్ బాగు చేయడానికి వెళ్లి..

- వృద్ధురాలి తలపై ఇనుప రాడ్డుతో దాడి
- హత్య కేసులో నిందితుడి అరెస్టు



కేసు పూర్వాపరాలను వివరిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

టెక్కలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న రాత్రి కోటబొమ్మాళి మండలం పెద్దహరిశ్చంద్రాపురం గ్రామంలోని కాళింగ వీధిలో దుంపల దాలమ్మ(68) అనే వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడు బల్లి రామును హరిశ్చంద్రాపురం బస్టాప్ వద్ద శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అదనపు ఎస్పీ(క్రైమ్స్) శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఏఎస్పీ కథనం మేరకు.. వృద్ధురాలు దాలమ్మ ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. ఆ ఇంటికి సంబంధించిన మోటార్ మరమ్మతులకు గురికావడంతో బాగుచేయాలని అదేవీధిలో ఎదురుగా ఉన్న బల్లి రాము అనే యువకుడిని కోరింది. మోటారు బాగుచేయడానికి వెళ్తూ ఆమె మెడలోని విలువైన బంగారు ఆభరణాలను గమనించాడు. ఈనెల 9న రాత్రి 8 గంటల తరువాత దాలమ్మ ఇంట్లోకి రాము వెళ్లాడు. మోటారు బాగుచేస్తానని చెప్పాడు. ఆమె టీ పెడుతున్న సమయంలో వెనుక నుంచి ఇనుప రాడ్డుతో తలపై దాడి చేసి మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెలతాడును దొంగిలించి పారిపోయాడు. దీంతో ఆమె మృతిచెందింది. మృతురాలు దాలమ్మ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేశామని ఏఎస్పీ తెలిపారు. ఆయన వద్ద నుంచి రెండున్నర తులాల పుస్తెలతాడు, హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్డును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సత్యనారాయణలు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

శ్రీకాకుళం క్రైం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఓ చోరీ కేసులో దొంగతనానికి పాల్పడిన వారిని పట్టుకున్నట్టు టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఎచ్చెర్ల మండలం సాకివానిపేట గ్రామానికి చెందిన కోరాడ రామలక్ష్మి తన భర్తతో కలిసి ఈ నెల 5వ తేదీన ఓ ఆటోలో ప్రయాణిస్తుండగా.. అదే ఆటోలో ఉన్న ఇద్దరు తమ బంగారు ఆభరణాలను కాజేశారని అదే రోజు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ రామారావు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో తోటపాలెం జంక్షన్ వద్ద విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెట్టాడ గ్రామానికి చెందిన గొర్లెల మౌనిక, గొర్ల పెద్దింటమ్మ, కొత్తవలస మండలం చీడివలసకు చెందిన మేకల హరిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని ఆటో సీజ్ చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు. కాగా వీరు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు.

11 మంది పేకాటరాయుళ్లపై కేసు నమోదు

వజ్రపుకొత్తూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి గ్రామానికి సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ బి.నిహార్ చెప్పారు. శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ నిహార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకొని వారి నుండి రూ.5,060 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాలు, తీరప్రాంత తోటల్లో పేకాట ఆడిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

జి.సిగడాంలో...

జి.సిగడాం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బాతువ సమీపంలో గల తోటపల్లి కుడి కాలువ గట్టుమీద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపిన వివరాల మేరకు.. పక్కా సమాచారం మేరకు దాడి చేసి పేకాటాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.13,900 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

శ్రీకాకుళం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నైరా పంచాయతీ చల్లవానిపేట గ్రామానికి చెందిన జామి సతీష్ కుమార్ అక్రమంగా మద్యం సీసాలు పట్టుకుని వెళ్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సతీష్ కుమార్ శుక్రవారం సాయంత్రం సిలగాం సింగివలసలోని మద్యం దుకాణం వద్ద నుంచి 15 (క్వార్టర్) మద్యం సీసాలను కొనుగోలు చేసి వాటిని తన ఇంటికి తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఎస్ఐ కె.రాము ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సివిల్ సప్లయిస్ జిల్లా ఏఎం(టెక్నికల్)కు బదిలీ

శ్రీకాకుళం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం బదిలీలను చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా సివిల్ సప్లయిస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఏఎం (టెక్నికల్) కె.శ్రీనివాసును పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ చేశారు. పరిపాలన విభాగం పరిధిలో ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఏపీఎస్‌ఎస్‌సీఎల్ ఎమ్‌డీ మన్‌జీర్ జీలానీ సమూన్ ఉత్తర్వులను జారీ చేశారు.

టంకాల బాబ్జీ సేవలు ఆదర్శం

నరసన్నపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణాభివృద్ధికి స్వాతంత్ర సమరయోధుడు టంకాల బాబ్జీ చేసిన సేవలు ఆదర్శంగా నిలుస్తాయని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం టంకాల బాబ్జీ వర్ధంతి, జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాబ్జీ కుటుంబం నరసన్నపేటలో జూనియర్, డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి ఆస్తులను ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సదాశివుని కృష్ణ, ఎంపీపీ ఆరంగి మురళీ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వైసీపీ కార్యాలయంలో అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతిచెందిన వారికి నివాళులు అర్పించారు.

కంకర వ్యవహారంపై దర్యాప్తు చేయండి: ఎమ్మెల్యే శిరీష



ప్రవీణ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మందస మండలం నల్లబొడ్లూరు కొండపై అక్రమంగా కంకరను తవ్వుకొని కొండంతా వైసీపీ నాయకులు కొట్టేశారని దీనిపై లోతుగా దర్యాప్తు చేసి దోషులకు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కు ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు సచివాలయంలో శుక్రవారం కలుసుకొని వినతి పత్రం అందించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బరి తెగించిన నాయకులు నల్లబొడ్లూరు కొండ మొత్తం 9 ఎకరాల్లో అక్రమంగా తవ్వకాలు చేసి కంకరంతా అమ్ముకున్నారని ఆరోపించారు. దీనిపై సహ చట్టం ద్వారా మొత్తం వివరాలు సేకరించి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామని ఎమ్మెల్యే శిరీష తెలిపారు. దీనిపై స్థానికంగా ఉన్న సర్పంచ్‌కు నోటీసులు ఇవ్వడమే కాకుండా రూ.4 కోట్ల వరకూ అపరాధ రుసుం విధించారని తెలిపారు. చట్టంలో ఉన్న చిన్నచిన్న లొసుగుల ఆధారంగా తాత్కాలికంగా కోర్టు నుంచి స్టే తెచ్చారని, ఈ విషయంలో లోతుగా దర్యాప్తు నిర్వహించి కోర్టు ముందు వారు చేసిన తప్పులు వివరించాలని కోరారు. తాత్కాలికంగా ఆ దోషులు బయట ఉండగలరేమో గాని త్వరలోనే శిక్ష అనుభవించి తీరుతారనడంలో ఎటువంటి సందేహం లేదని శిరీష పేర్కొన్నారు.

విమాన ప్రమాద మృతులకు ఘన నివాళి

అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సంతాపం తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పాతపట్నంలో ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు



నరసన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న బగ్గు అర్చన తదితరులు



జలుమూరు: శ్రీముఖలింగంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు

న్యూస్ బాక్స్

విద్యకు పెద్ద పీట

వజ్రపుకొత్తూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. గోవిదంపురం హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు విద్యాకిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టీడీపీ నాయకుడు కర్ని రమణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెనకు త్వరలో టెండర్లు

కాశీబుగ్గ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు మంజూరు చేసిన నిధులతో త్వరలోనే టెండర్లు పిలవనున్నట్టు రైల్వే శాఖ ఇంజనీరింగ్ అధికారులు తెలియజేశారని జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు చెప్పారు. మంగళవారం విశాఖ రైల్వే డివిజన్ కార్యాలయంలో ఈస్టుకోస్ట్ రైల్వే ఇంజనీరింగ్ విభాగపు ముఖ్య అధికారి పంకజ్ చౌహాన్‌తో కలిసి ప్రజల ఇబ్బందులను వివరించారు. ఆర్‌ఓబీ పూర్తి చేసి తమ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

టీటీడీ కల్యాణ మండపం నిర్మించండి

పలాసలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించాలని రాష్ట్ర దేవదాయ . శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని శుక్రవారం పలాస జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దుర్గారావు వినతిపత్రం అందజేశారు. పేద, మధ్య తరగతి ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకొని కల్యాణ మండపం నిర్మించాలని కోరారు. ఆయనతో పాటు జనసేన నాయకులు బి విద్యాసాగర్, సుధీర్ ఉన్నారు.

వృద్ధులకు అందరం అండగా ఉండాలి



వృద్ధులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి వాణి

నరసన్నపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని స్థానిక సివిల్ కోర్టు న్యాయాధికారి ఎస్.వాణి సూచించారు. శుక్రవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గొట్టిపల్లిలో గల వృద్ధుల తపోవనాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులతో ముచ్చటించారు. ఆరోగ్య విషయాలు, తపోవనంలో భోజన, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పండ్లు, ఔషధాలు, ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియన్ అధ్యక్షులు రావాడ కొండలరావు, కార్యదర్శి జి.వెంకటరమణ, నర్సింగరావు, మధుసూధనరావు, గొండు సత్యనారాయణ, రోణంకి కృష్ణంనాయుడు, జీవీజీనాయుడు, వాన శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, తపోవనం నిర్వాహకులు గుడ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురం భూ సమస్య పరిష్కరించండి



ధర్నా చేస్తున్న గిరిజనులు

హిరమండలం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గులుమూరు పంచాయితీ జగన్నాథపురం గిరిజనుల భూ సమస్య పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాదరావు, గిరిజన సంఘం నాయకుడు సవర అప్పన్న డిమాండ్ చేశారు. శుక్రవారం హిరమండలం తహసీల్దారు కార్యాలయం ఎదుట గిరిజనులతో కలసి ధర్నా చేశారు. డి పట్టాలు కలిగిన గిరిజనులతో ఏరువాక కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. తహసీల్దారు జోక్యం చేసుకొని గిరిజనుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని అన్నారు. సర్వే నెంబరు 284, 284-1లో సుమారు 40 ఏళ్ల క్రితం గిరిజనులకు భూ హక్కు పత్రాలు ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు.

జీడికి మద్దతు ధర ప్రకటించండి



సమావేశంలో పాల్గొన్న రైతులు, సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు.. జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జీడిపిక్కలకు మద్దతు ధరను ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడిరైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాతుపురంలో జీడిరైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఎన్నికలల్లో ఇచ్చిన హామీ మేరకు జీడి రైతాంగాన్ని అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు. వ్యాపారులు పరిశ్రమలను బంద్ చేసి కృత్రిమంగా జీడిపిక్కల ధరను తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. దీంతో గ్రామాలలో పిక్కల ధరలు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని జీడిరైతులకు భరోసా కల్పించాలని కోరారు.

ఏటీఎం పనిచేయక వినియోగదారుల అవస్థలు



నందిగాంలో పని చేయని ఎస్‌బీఐ ఏటీఎం

నందిగాం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందిగాంలో ఉన్న ఏకైక ఎస్‌బీఐ ఏటీఎం ఐదు రోజులుగా పనిచేయకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కాంప్లెక్స్ సమీపంలోని సర్వీసు రహదారిలో ఉన్న ఏటీఎం ఎంతోమందికి ఉపయోగపడేది. ఐదు రోజులుగా ఇది మొరాయించడంతో వినియోగదారులు ఏటీఎంకు వచ్చి నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వాహనదారులు ఏటీఎంపై ఆశతో వస్తున్నప్పటికీ ఫలితం లేకుండాపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి ఏటీఎంకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని వినియోగదారులు కోరుతున్నారు.

నేడు సచివాలయాల్లో యోగాంధ్ర

పోలాకి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ సచివాలయాల్లో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. యోగా ట్రైనీలు, నిర్వాహకుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

అగ్నిబాధితులకు సరుకుల పంపిణీ

కొత్తూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు బీసీ కాలనీలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ నిత్యావసర సరకులను అందజేసింది. కోగాన పద్మవతి ఇల్లు ఇటీవల అగ్నికి ఆహుతి కావడంతో సర్వస్వం కోల్పోయి.. కట్టుబట్టలతో మిగిలారు. బాధితురాలికి సరుకులు అందజేసిన వారిలో పొగిరి రవి, గండివలస ఆనందరావు, మనోజ్, పెద్దకోట యతిరాజు, వినోద్‌కుమార్ తదితరలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పోలాకి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈదులవలస 11కేవీ ఫీడర్ వ్యవసాయానికి సంబందించి మరమ్మతులు చేపడుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జి.శంకరరావు, ఏఈ విశ్వేశ్వరరావు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గొల్లలవలస, తోటాడ, సంతలక్ష్మీపురం, కొండలక్కివలస, కింజరాపువానిపేట గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రైతులకు బాసటగా ప్రభుత్వం

పాతపట్నం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రైతులకు మొదటి నుంచీ టీడీపీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందని మండల పార్టీ అధ్యక్షులు సైల బాబ్జీ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులకు రాయితీపై ఇచ్చిన ఫీడర్‌షీడర్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు బాసటగా నిలిచేందుకు టీడీపీ ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్, శివాల చిన్నయ్య, కలమట భుజంగరావు, కె.మన్మథరావు, ఎస్.బుల్లిబాబు, రైతులు పసుపురెడ్డి మహేష్, దాసుపురం గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బురదతో వాహనచోదకులకు ఇక్కట్లు



బురదతో అధ్వానంగా ఉన్న రహదారి

వజ్రపుకొత్తూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై ఉన్న గోతులలో నీరుచేరి రోడ్లు బురదమయమయ్యాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంపల్లి - పెద్దబడాం రోడ్డు, పూండి రోడ్డు, అక్కుపల్లి, బెండి రోడ్లపై ఈ దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణం చేయడం ఇబ్బందిగా ఉంటోందని వాహన చోదకులు చెబుతున్నారు. బురద కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై గుంతలను పూడ్చితే కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



బొడ్డపాడులో సబ్సిడీ విత్తనాల పంపిణీ చేస్తున్న దృశ్యం

పలాసరూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కూటమి నాయకులు అన్నారు. పలాస మండలం బొడ్డపాడలో రానున్న ఖరీఫ్‌లో అవసరమైన వివిధ రకాల విత్తనాలను సబ్సిడీపై శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కిక్కర ఢిల్లీరావు, సర్పంచ్ తామాడ మదన్, హార్టీకల్చర్ అధికారి పావని పాల్గొన్నారు. లక్ష్మీపురం క్లస్టర్ పరిధిలో విత్తనాల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్ నాయుడు, దువ్వాడ హర్ష, బూర్లె కృష్ణంరాజు, రైతులు పాల్గొన్నారు.